

**రామప్ప వైభవాన్ని చాటిచెప్పాలి**
మిస్ వరల్డ్ టీమ్ అబ్బురపడేలా రామప్ప కళావైభవం చాటిచెప్పాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. - 8లో▸



**'సన్న బియ్యం' దేశానికే ఆదర్శం**
కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం దేశానికే ఆదర్శమని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$39^0/23^0$

**వాతావరణం**
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

# రెన్యువల్ చేయక.. కొనసాగించక!

**అయోమయంలో ఔట్ సోర్సింగ్ కార్మికులు**
- అరకొర వేతనాలతో 15 ఏళ్లుగా నర్సంపేట సీహెచ్‌సీలో విధులు
- విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రి



ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో మాట్లాడుతున్న కార్మికులు (ఫైల్)

**నర్సంపేట రూరల్:** పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నర్సంపేటలో సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) ఏర్పాటు చేసింది. ఆస్పత్రికి కావాల్సిన రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో 15 సంవత్సరాల క్రితం ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 21 మందిని విధుల్లోకి తీసుకున్నారు. ఇందులో ఆరుగురు రక్తనిధిలోని పలు విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరిని టీవీవీపీ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) నుంచి డీఎంఈలో విలీనం చేశారు. మిగిలిన 15 మంది చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తూ పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ వచ్చారు. వీరి కాంట్రాక్టు మార్చి 31తో ముగిసింది. సీహెచ్‌సీని ప్రభుత్వం జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి, వైద్య కళాశాలను మంజూరు చేసింది. ఈక్రమంలో టీవీవీపీ నుంచి ఆస్పత్రిని డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) పరిధిలోకి మార్చారు. టీవీవీపీ ఆధ్వర్యంలో కొనసాగిన ఏజెన్సీలు డీఎంఈ పరిధిలోకి రాకపోవడంతో మరో టీవీవీపీ ఆస్పత్రిలో ఈ సిబ్బందిని సర్దుబాటు చేయాల్సి ఉంది. జిల్లాలోనే వర్ధన్నపేట సీహెచ్‌సీ టీవీవీ పరిధిలో ఉంది. ఆ ఆస్పత్రిలో 15 మందికి సంబంధించిన పోస్టులు ఖాళీలు లేవు. రక్తనిధిలో పనిచేస్తున్న వారితో 15 మందిని డీఎంఈలో విలీనం చేస్తే అయిపోయేది. అలా చేయకపోవడంతో వారికి రెన్యువల్ చేసే అవకాశం లేకుండా పోయింది.

**అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కార్మికుల ప్రదక్షిణ..**
నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి పూర్తి బాధ్యతలను సూపరింటెండెంట్ నర్సింహస్వామి.. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, సూపరింటెండెంట్ కిషన్‌కు అప్పగించి డిప్యుటేషన్‌పై వర్ధన్నపేటకు వెళ్లిపోయారు. కానీ, 15 మంది సిబ్బంది పరిస్థితి మాత్రం ఎవరూ పట్టించుకోలేదు. వారి బాధ్యత డీఎంఈ అధికారులే చూసుకోవాలని టీవీవీపీ అధికారులు చెబుతున్నారు. టీవీవీపీలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కాంట్రాక్ట్ అయిపోయిందని డీఎంఈ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఏం చేయాలో అర్థం కాక ఔట్‌సోర్సింగ్ కార్మికులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. శనివారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని హనుమకొండలోని ఆయన నివాసంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది కలిసి సమస్య విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సిబ్బంది తెలిపారు. కాగా, ఆస్పత్రిలో 180 కాంట్రాక్టు పోస్టుల భర్తీకి గత ఏడాది నోటిఫికేషన్ విడుదల చేశారు. తొలుత మీకు ప్రాధాన్యం ఇచ్చిన తర్వాతనే మిగిలిన వారిని విధుల్లోకి తీసుకుంటామని అధికారులు, ప్రజాప్రతినిధులు అప్పుడు హామీ ఇచ్చారు. కానీ, ఆ పోస్టుల భర్తీలో అవకతవకలు జరగడంతో ఏజెన్సీనే ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో ఆ నియామకాలు ఆగిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమను రెన్యువల్ చేయాలని ఔట్ సోర్సింగ్ సిబ్బంది కోరుతున్నారు.

**ప్రభుత్వానికి నివేదించాం..**



వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 15 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులను డీఎంఈలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదికను సమర్పించాం. గతంలో టీవీవీపీ కమిషనర్ నర్సంపేట ఆస్పత్రిని తనిఖీ చేసినప్పుడు కార్మికులు తమ సమస్యను విన్నవించగా మొదటి ప్రాధాన్యం మీకే ఇస్తామని చెప్పారు. మరోసారి లిఖిత పూర్వకంగానే వినతిపత్రాన్ని అందించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నడుచుకుంటాం.

\- డాక్టర్ రామ్మూర్తి, డీసీహెచ్ఎస్, వర్ధన్నపేట

**రెన్యువల్ చేస్తేనే విధుల్లో కొనసాగిస్తాం ..**



ఔట్ సోర్సింగ్ కార్మికులకు సంబంధించిన రెన్యువల్ మార్చి 31లోగా ముగిసి పోయింది. దీనిపై ఉన్నతాధికారులకు గతంలోనే నివేదించాం. కానీ, డీఎంఈలోకి తీసుకోవాలని ఎలాంటి ఆదేశాలు మాకు రాలేదు. ఆసిబ్బంది రెన్యువల్ పొడిగిస్తున్నట్లు ఆదేశాలు కూడా రాకపోవడంతో ఎలా పనిచేయించుకోవాలి, ఎవరు జీతాలు అందించాలి అనే ప్రశ్నలు తలెత్తాయి. రెన్యువల్ చేస్తున్నట్లు అయినా, డీఎంఈలోకి తీసుకున్నట్లు అయినా లేఖ తెస్తేనే విధుల్లోకి తీసుకోవడం సాధ్యమవుతుందని సిబ్బందికి తెలిపాం.

\- డాక్టర్ మోహన్‌దాస్, నర్సంపేట వైద్య కళాశాల ప్రిన్సిపాల్

## బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

**రామన్నపేట:** మాజీ ఉపప్రధాని, స్వాతంత్య్ర సమరయోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను వరంగల్ ఎల్‌బీ కళాశాలలోని జయసేన మెమోరియల్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

## తూర్పులో 'ఫొటో' రాజకీయం

**రేషన్ షాపుల్లో ప్రధాని మోదీ చిత్రపటం పెట్టాలి..**
- నియోజకవర్గంలో బీజేపీ నాయకుల డిమాండ్
- కమలం వర్సెస్ కాంగ్రెస్‌గా మారిన సన్న బియ్యం పంపిణీ



వరంగల్ గిర్మాజీపేటలోని రేషన్ షాపు ఎదుట కాంగ్రెస్, బీజేపీ నాయకుల వాగ్వాదం

**సాక్షి, వరంగల్:** వరంగల్ తూర్పులో రాజకీయం రాజుకుంటోంది. సన్న బియ్యం పంపిణీ కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారింది. సన్న బియ్యంలో కేంద్రం వాటా ఎక్కువని, రాష్ట్ర వాటా చాలా తక్కువ అంటూ.. ఎక్కువ వాటా ఇస్తున్న ప్రధాని మోదీ చిత్రపటం లేకుండా, తక్కువ వాటా ఇచ్చే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో ఎలా పెడతారంటూ బీజేపీ నేతలు ఆందోళనకు దిగారు. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల, పాలకుర్తి నియోజకవర్గాల్లో సన్న బియ్యం పంపిణీ ఈ నెల ఒకటో తేదీన ప్రారంభం కాగా.. వరంగల్ తూర్పులో మాత్రం శనివారం నుంచి ప్రారంభమైంది. వరంగల్ నగరంలోని 27వ డివిజన్ గోవిందరాజులగుట్ట, 32వ డివిజన్‌లోని ఎస్ఆర్ఆర్ తోట, 37వ డివిజన్ తూర్పుకోటలోని కొత్తగడ్డ, 18వ డివిజన్ లేబర్ కాలనీలోని గాంధీనగర్ రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఆయా రేషన్ షాపుల వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలు ఏర్పాటు చేశారు. ఒక్కో లబ్ధిదారుడికి ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం నుంచే వస్తున్నాయని, ఒక కిలో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోందంటూ వరంగల్ బీజేపీ నాయకులు వివిధ రేషన్ షాపుల వద్ద శనివారం ఆందోళనకు దిగి ప్రధాని మోదీ చిత్రపటం పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంటా రవికుమార్, సీనియర్ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఇతర నేతలు గిర్మాజీపేటలోని గోవిందరాజుల గుట్ట ప్రాంతంలోని ఓ రేషన్ దుకాణం వద్ద ప్రధాని మోదీ చిత్రపటం పట్టుకొని ఆందోళనకు దిగారు. అన్ని రేషన్ షాపుల వద్ద మోదీ ఫొటో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ కార్యకర్తలే ఏర్పాటు చేస్తారని అల్టిమేటం జారీ చేయడంతో తూర్పు నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కినట్లయ్యింది. ఆ సమయంలో కాంగ్రెస్ నేతల రాకతో కాస్త గొడవ జరిగినా.. ఆ తర్వాత పోలీసుల రాకతో సద్దుమణిగింది. ఓవైపు కాంగ్రెస్ సన్న బియ్యం క్రెడిట్ మాదేనని చెప్పుకుంటుంటే.. రేషన్ షాపుల్లో ప్రధాని మోదీ ఫొటో ఏర్పాటు చేయాలని ఇంకోవైపు బీజేపీ డిమాండ్ చేస్తుండడం గమనార్హం. ఇదిలా ఉండగా మామునూరు విమానాశ్రయం ఏర్పాటు విషయంలో క్రెడిట్ మాదంటే మాదని ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ పోటీపడుతున్న సంగతి తెలిసిందే.

## రైతులను ఆదుకోవాలి

**నర్సంపేట:** అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలోని ఓంకార్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేతికి పంటలు వచ్చే దశలో అకాల వర్షాలు తీరని నష్టాన్ని చేకూర్చాయని పేర్కొన్నారు. మొక్కజొన్న, ధాన్యాన్ని కొనుగోళ్లకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని కోరారు.

**7, 8న జలంధర్‌లో జాతీయ కార్యవర్గ సమావేశాలు**
ఏఐకేఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈనెల 7, 8 తేదీల్లో పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో జరుగనున్నాయని రమేశ్ తెలిపారు. సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరికుప్పల వెంకన్న, గిరిజన రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ వి.తుకారాంనాయక్ హాజరవుతారని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

## రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



భోజనం చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, ఎర్రబెల్లి స్వర్ణ

**పర్వతగిరి:** రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు అన్నారం షరీఫ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు.. జై భీమ్.. జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు అంబేడ్కర్ ఇచ్చిన స్ఫూర్తి, గాంధీజీ ఐడియాలజీని ప్రజల్లోకి తీసుకుకెళ్లేందుకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్య్ర సమరయోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి రమేశ్ ఇంటిలో సన్న బియ్యంతో వండిన భోజనం చేశారు. వర్ధన్నపేట ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ దూపాకి సంతోష్, మహిళా మండలి నాయకురాలు మాసాని సువార్త తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను నిలదీసిన రావూరు గ్రామస్తులు**
పాదయాత్రలో భాగంగా రావూరు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే నాగరాజును తండావాసులు ప్రశ్నలతో ముంచెత్తారు. ఆరు గ్యారంటీల అమలుపై మహిళలు నిలదీశారు. ఆకేరు వాగు నీటిని పంటలకు అందించడంలో విఫమయ్యారని మండిపడ్డారు. హామీలు నెరవేర్చకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావును వారు హెచ్చరించారు.

## న్యూస్‌రీల్

**కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్**
- నేటి నుంచి నెల రోజులపాటు అమలు
- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడి



**వరంగల్ క్రైం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 30 రోజుల పాటు సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారంనుంచి మే 5 వరకు సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషనరేట్ పరిధిలో పోలీస్ అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి మైకులు, డీజేలు వినియోగించరాదని హెచ్చరించారు. సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులను నిషేధించినట్లు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శబ్ద కాలుష్య నియంత్రణలో భాగంగా డీజే సౌండ్‌ను నిషేధించామని, ఆస్పత్రులు, విద్యాలయాలకు 100 మీటర్ల దూరం వరకు వినియోగించరాదని, మైకులు వినియోగించాల్సి వస్తే స్థానిక ఏసీపీల అనుమతి తప్పనిసరని వివరించారు. మైకులకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సమయంలో అనుమతి తీసుకుని వినియోగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సిటీ పోలీస్ యాక్ట్ ఉత్తర్వులను కమిషనరేట్ పరిధిలో ఎవరు అతిక్రమించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ఆయుష్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి**



**గీసుకొండ:** సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం కింద రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ ఉద్యోగులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ అనుబంధ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్ కోరారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆయుష్ ఉద్యోగులకు నెలకు రూ.13,800 చెల్లిస్తుందని, ఇందులో కటింగ్ పోను రూ.10,200 చేతికి వస్తున్నాయన్నారు. ఈ జీతం చాలక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, 2014 లోపు నియమితులైన వారిని రెగ్యులర్ చేయాలని, డిప్యూటేషన్లను రద్దుచేసి నియామకమైన చోటే పనిచేసేలా చూడాలని, సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో రాష్ట్ర జట్టుకు 8వ స్థానం**



**గీసుకొండ:** ఒడిశా రాష్ట్రంలోని పూరీ జగన్నాథ్ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి సీనియర్ ఖోఖో పోటీల్లో శనివారం రాష్ట్ర జట్టు 8వ స్థానం సాధించిందని టీం శిక్షణ ఇన్‌చార్జ్ కోట రాంబాబు తెలిపారు. క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారని, త్వరలో మేఘాలయలో జరిగే జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర జట్టు అర్హత సాధించిందని ఆయన పేర్కొన్నారు.

**రాములోరి పెళ్లికి గోటి తలంబ్రాలు**



**దుగ్గొండి:** మండలంలోని నాచినపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఈసారి 'మన ఊరి రాముడికి మన తలంబ్రాలు' పేరుతో బైరెడ్డి నిరంజనాదేవి ఇంట్లో మహిళలు గోటి తలంబ్రాలు తయారు చేశారు. శనివారం సాయంత్రం వరకు 11 కిలోల గోటి తలంబ్రాలు సిద్ధం చేసినట్లు నిరంజనాదేవి తెలిపారు. ఆదివారం తలంబ్రాలను ఆలయానికి తీసుకువెళ్లనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పుచ్చకాయల అరుణ, అండ్రు సంధ్యారాణి, బొమ్మినేని రమాదేవి, బైరెడ్డి కళావతి, రావుల కవిత, శైలజ, రిత్విక తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణం చూతము రారండి..



విద్యుత్ దీపాల వెలుగుల్లో వరంగల్ శివనగర్‌లోని రామాలయం


**సాక్షి, నెట్‌వర్క్:** శ్రీరామ నవమిని పురస్కరించుకుని జిల్లాలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఆలయ కమిటీలు, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టువస్త్రాలు, తలంబ్రాలు, బాసింగాలు, జీలకర బెల్లం సిద్ధం చేశారు. వరంగల్ నగరం, నర్సంపేట, వర్ధన్నపేట, మండల కేంద్రాలు, గ్రామాల్లోని ఆలయాల్లో భక్తుల కోసం చలువ పందిళ్లు వేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. వరంగల్ శివనగర్ రామాలయంలో సుమారు 10 వేల మంది భక్తులు వీక్షించేలా పెద్ద పెద్ద ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు భారీగా తరలివచ్చి సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించాలని ఆలయ కమిటీల బాధ్యులు కోరుతున్నారు.

## సరస్వతీ పుష్కరాల్లో 'జ్ఞానతీర్థం' శోభ



పుష్కరఘాట్‌కు రెయిలింగ్‌తో మకరం నిర్మాణం నమూనా

- పుష్కరఘాట్‌కు కాకి, హంస, మకరం చిత్రాలతో కూడిన రాయి రెయిలింగ్



పుష్కరఘాట్ వద్ద ఫైబర్‌తో ఏర్పాటు చేయనున్న ఆహ్వాన విగ్రహం నమూనా

**కాళేశ్వరం:** జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి పుష్కరాల్లో జ్ఞానతీర్థం (ఆహ్వాన విగ్రహం) ఏర్పాటు చేయనున్నారు. పుష్కరాల అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25కోట్ల నిధులు మంజూరు చేసి విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పలుమార్లు సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనలతో పనులు ఊపందుకున్నాయి. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించడంతో పనుల్లో వేగం పెరిగింది. సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రూ.20 లక్షలతో 'జ్ఞానతీర్థం' ఎఫ్ఆర్‌పీ ఫైబర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తాళపత్ర గ్రంథాలతో రెండు చేతుల్లో దీపం వెలిగి ప్రకాశించేలా ఫైబర్ విగ్రహం నిర్మాణం చేయనున్నారు. దీని నమూనా చిత్రాలను ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్లు తయారు చేశారు. ఈ విగ్రహం ఉద్దేశం ఏమిటంటే.. పూర్వం కాకి నదిలో స్నానం చేసి హంసలాగా మారి జ్ఞానం పొందింది. అలా ఇక్కడి నదిలో స్నానం చేసిన భక్తులు జ్ఞానాన్ని పొందుతారని సారాంశంగా, భక్తులను ఆహ్వానించేలా ఉండే విధంగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. అదేవిధంగా జ్ఞానతీర్థం (వీఐపీ) ఘాట్ రెయిలింగ్‌ను కాకి, హంస, మకరం చిత్రాలను రాతిపై చెక్కి అమర్చనున్నారు.

## కవి రామా చంద్రమౌళికి సాహిత్య పురస్కారం



**హన్మకొండ కల్చరల్:** హైదరాబాద్ వంశీ ఇంటర్నేషనల్ ఇండియా ప్రదానం చేయనున్న డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి సాహిత్య పురస్కారానికి వరంగల్‌కు చెందిన కవి, రచయిత రామా చంద్రమౌళి ఎంపికయ్యారు. ఈమేరకు ఉగాది సంబరాల్లో భాగంగా ఏప్రిల్ 12, 13 తేదీల్లో హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా సంయుక్తంగా నిర్వహించే కార్యక్రమంలో రామా చంద్రమౌళికి ఈపురస్కారం అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

● సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి

**విద్యారణ్యపురి:** అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేకపోతే ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని పెన్షనర్ల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లోని తెలంగాణ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు పింఛన్ అనేది బిచ్చం కాదని ఉద్యోగుల హక్కు అన్నారు. ఆయా సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించాలని లేకపోతే ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందన్నారు. సమావేశంలో ఆ సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమయ్య బాధ్యులు మాదిరెడ్డి మల్లారెడ్డి, ఖాజా నయీముద్దీన్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య ఉద్యమాలతో ఎదుర్కొంటాం..



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

**హన్మకొండ:** కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన పింఛన్ బిల్లును ఐక్య ఉద్యమాల ద్వారా ఎదుర్కొందామని తెలంగాణ పెన్షనర్స్ అసోషియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇ.నరసింహారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.వీరస్వామి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో అసోసియేషన్ 2024–25 ఆర్థిక నివేదికపై చర్చించి ఆమోదించారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామ మనోహర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కర్రె సుధీర్‌బాబు, బాధ్యులు సీహెచ్.సూర్యప్రకాశ్, ఎల్.ప్రభాకర్ రెడ్డి, రత్నాకర్, కె.రమేశ్, కె.సమ్మారెడ్డి, సింగారెడ్డి, రాజిరెడ్డి, గైని సత్యనారాయణ, సుకుమార్‌రెడ్డి, శ్యామ్‌సుందర్ రెడ్డి, కిష్టయ్య, ఆగయ్య, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిపై టాస్క్‌ఫోర్స్ దాడి..

● పోలీసుల అదుపులో ఇద్దరు

**మామునూరు :** ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం రాత్రి దాడి చేసి ఓ మహిళతోపాటు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్ తెలిపారు. గవిచర్ల రోడ్డులోని ఓ ఇంటిపై దాడి చేయగా ఓ మహిళ, హనుమకొండ బాలసముద్రం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పెరుమండ్ల రాజీవ్(32) పట్టుబడ్డారు. కాశికుంట ఫోర్ట్‌రోడ్డుకు చెందిన ఆటో డ్రైవర్ మేకల రాము యాదవ్ పరారీలో ఉన్నాడు. వీరి నుంచి 2 స్మార్ట్ ఫోన్లు, రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తదుపరి చర్యల నిమిత్తం మామునూరు పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ తెలిపారు. ఎస్సై దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.



జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన ఒగ్గు మహేశ్ (42) ఎకరం భూమిలో వరి సాగు చేశాడు. భూగర్భ జలాలు అడుగంటి బోరు నుంచి నీళ్లు సరిగా రాకపోవడంతో కళ్ల ముందే పంట ఎండిపోయింది. దీంతో మనోవేదనకు గురైన మహేశ్ ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఓ వైపు కూతురు పెళ్లికి చేసిన అప్పు ఎలా తీర్చాలని.. మరో వైపు ఎండిపోతున్న వరి పంట మహేశ్ బలవన్మరణానికి కారణమయ్యాయి..

..ఈ నేపథ్యంలో ఎన్ని కష్టాలు ఎదురైనా.. ఎన్ని నష్టాలు చుట్టుముట్టినా అధైర్య పడొద్దని.. ఈసారి కాకపోయినా వచ్చే దఫా అయినా కలిసొస్తుందనే దృక్పథంతో ప్రతీ రైతు కొత్త ఆశలతో ఆలోచించాలని, అంతేకాని ఆత్మహత్యకు పాల్పడొద్దని 'వరి' అన్నదాతలను వేడుకుంటోంది.

# నేను వరిని..!

## అన్నదాత.. నన్ను కాపాడుకోలేక నీవు కాటికి పోవద్దు



వర్ధన్నపేటలో ఎండిన వరి పంటను కోస్తున్న రైతు

● నన్ను పండించి.. మీరు దిగులు చెందొద్దు
● రైతులకు 'వరి' విజ్ఞప్తి

**నర్సంపేట:** నేను కోట్లాది మంది ఆకలి తీర్చే 'వరి' పంటను. నన్ను రైతు మొలక దశలో చంటి పిల్లలా కాపాడుకున్నాడు. నాకు ఎలాంటి జబ్బు చేయకుండా మందు పిచికారీ చేశాడు. ఏపుగా పెరిగిన నన్ను 30 రోజుల్లో కూలీలతో నాటించాడు. నాలో ఎలాంటి కలుపు మొక్కలు మెలవకుండా గడ్డి మందు చల్లాడు. అప్పు తెచ్చి యూరియా, డీఏపీ, ఇతర మందులు వేసి నేను బలంగా పెరిగేలా చేశాడు. పొట్ట దశకు చేరుకోవడాన్ని నన్ను చూసి ఎంతో మురిసిపోయాడు. పైపాటు మందులు పిచికారీ చేశాడు. అయితే చి'వరి'కి నా దాహానికి నీరు లేకపోవడంతో (భూగర్భ జలాలు) ఎండిపోతున్న నన్ను చూసి బోరున విలపించాడు. నన్ను కాపాడుకునేందుకు తాపత్రయపడ్డాడు. నా సమీపంలో ఉన్న చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల నుంచి పైపులు వేసి నా దాహార్తిని తీర్చడానికి భగీరథ ప్రయత్నం చేశాడు. అలాగే, వేలాది రూపాయలు వెచ్చించి ట్యాంకర్లతో నీరు తీసుకొచ్చినా నా దప్పిక తీర్చడానికి శతవిధాలా యత్నించాడు. అయినా నా దూప తీరడం లేదు. దీంతో చివరికి కొందరు( అన్నదాతలు) నన్ను పశువులకు మేతగా వదిలేస్తుండగా.. మరికొందరు నన్ను కాపాడుకోలేక ప్రాణాలు వదిలేస్తున్నారు. (మీకు) రైతుకు పంటను అందించి మీ సంతోషాన్ని చూడాల్సిన నేను మీ కన్నీటిని చూస్తున్న. నన్ను క్షమించు రైతన్న. అయితే రైతన్నాలారా క్షణికావేశంలో కఠిన నిర్ణయాలు తీసుకోకండి. మీమ్మలను నమ్ముకున్న వారికి కన్నీళ్లు మిగిల్చకండి. ఒక్కసారి ప్రశాంత మనస్సుతో ఆలోచించండి. ప్రతీ సమస్యకు చావే పరిష్కారం కాదు. ఇలా అయితే భూమిపై ఎవరూ బతికుండరు. ప్రతీ సమస్యకు కచ్చితంగా పరిష్కారం ఉంటుంది. సాగులో ఎన్ని కష్టాలు ఎదురైనా.. ఎన్ని నష్టాలు చుట్టుముట్టినా అధైర్య పడొద్దు. ఈసారి కాకపోయినా వచ్చే దఫా అయినా కలిసొస్తుందనే దృక్పథంతో కొత్త ఆశలతో ఆలోచించు. అంతేకాని ఆత్మహత్యలకు పాల్పడి అటు కన్నవారికి.. ఇటు కట్టుకున్న వారికి శోకం మిగిల్చొద్దు.

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగులో నాదే (వరి) అగ్రస్థానం..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8లక్షల 48వేల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటల సాగు అయినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా లక్ష ఎకరాలకు పైగా నేను( వరి) సాగైనట్లు తెలుస్తోంది. చెరువులు, కుంటలు, బోర్లు, వ్యవసాయ బావులు, ఎస్సారెస్పీ కాల్వల కింద యాసంగిలో ఎంతో ఆశతో నన్ను సాగు చేశారు. ఈ నెల చివరి వరకు నేను చేతికి అందొచ్చే దశలో ఉన్నా. ఈ క్రమంలో ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటడంతో బావులు, బోరుబావుల నుంచి సరిగా నీరు రాకపోవడంతో నా దాహం తీరడం( ఎండిపోవడం) లేదు. దీంతో నన్ను కాపాడుకునేందుకు రైతులు పాట్లు పడుతున్నారు. బోరు బావుల మరమ్మతులతోపాటు వ్యవసాయ బావుల పూడికతీతతో ఆర్థికంగా సతమతమవుతున్నారు. అయితే ఎంత లోతుకు వెళ్లినా నీరు మాత్రం రావడం లేదు. అలాగే, వరంగల్ జిల్లాలో పలు మండలాలకు ఎస్సారెస్పీ జలాలు అందుతున్నాయి. అయితే చివరి ఆయకట్టుకు నీరందకపోవడంతో నాకు దాహం (ఎండిపోయే పరిస్థితి) తీరడం లేదు. కాల్వలు తుమ్మ చెట్లు, ఇతర ముళ్ల పొదలతో నిండి ఉండడంతో నీరు ముందుకెళ్లే పరిస్థితి లేదు. వాగులు, ఎస్సారెస్పీ జలాలు రాలేకపోవడంతో పరీవాహక ప్రాంతాల్లో నాకు దాహం తీరడం లేదు. దీంతో పొట్ట దశలో ఉన్న నాపై ఆశలు వదులుకొనే పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు ఎకరాకు రూ.30వేల నుంచి రూ.35వేల మధ్య పెట్టుబడి పెట్టిన రైతులు ఇక నన్ను కాపాడే దారిలేక దిక్కుతోచని స్థితిలో పడ్డారు. రైతులు ఆత్మహత్యకు యత్నిస్తున్నారు. అన్నదాతలు ఇలా చేయకండి. ఈ ఏడాది కాకపోయినా వచ్చే ఏడాదైనా చేతికందొచ్చి మీకు సరిపందలు కురిపిస్తా..

ఇట్లు
మీ వరి..

# పార్థసారథి హత్య కేసులో మరొకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక

**మహబూబాబాద్ రూరల్ :** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం శివారు బోరింగ్ తండా సమీపంలో దారుణహత్యకు గురైన దంతాలపల్లి ఎంజేపీ గురుకులం హెల్త్ సూపర్ వైజర్ తాటి పార్థసారథి హత్య కేసులో మరొకరిని అరెస్ట్ చేశామని రూరల్ సీఐ పి.సర్వయ్య, ఎస్సై వి.దీపిక శనివారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే మృతుడి భార్య స్వప్న, ఆమె ప్రియుడు వెంకటవిద్యాసాగర్, తెలగరి వినయ్ కుమార్, బోగ శివకుమార్, మోతుకూరి వంశీని అరెస్ట్ చేశామన్నారు. ఈ క్రమంలో శనివారం మరొకరి అరెస్ట్ చేశామన్నారు. గతంలో పార్థసారథి హత్య చేయడానికి నిర్వహించిన రెక్కీలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా రాజాఓమంగి మండలం జెడ్డంగి గ్రామానికి చెందిన కూసం లవరాజు పాల్గొన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. దీంతో అతడిని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

# ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్.. నలుగురి అరెస్ట్

● రూ.20 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు చూపుతున్న పోలీసులు

**కాజీపేట రూరల్ :** ఆన్‌లైన్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 20వేల నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాజీపేట పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొంతమంది ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ పెట్టి ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ బృందానికి శనివారం విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసి గోదాగు శ్రీనివాస్, గొడుగు రమేశ్, సముదాల శ్రీనివాస్, బోకరి సంతోశ్‌ను అరెస్ట్ చేసింది. వీరి నుంచి రూ.20 వేలు నగదుతో పాటు నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు.

**పెద్దాపూర్‌లో ఆన్‌లైన్ చేయిస్తున్న మరొకరు..**

**ఆత్మకూరు:** ఆన్‌లైన్‌లో ఐపీఎల్ బెట్టింగ్ చేయిస్తున్న మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన ముక్కల రాజును టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముక్కల రాజు 'డఫాబెట్' అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్, 'గోల్డెన్ 365' (తీన్‌పత్తా) అనే గేమింగ్ వెబ్‌సైట్ ద్వారా బెట్టింగ్ చేయిస్తుండగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, సీఐ శ్రీధర్, సిబ్బందికి సమాచారం వచ్చింది. దీంతో వారి ఆదేశాల మేరకు రాజును అరెస్ట్ చేసి తదుపరి చర్యల నిమిత్తం ఆత్మకూరు పోలీసుకు అప్పగించారు. అలాగే, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నల్లగొండకు చెందిన మర్రి సుధీర్‌కుమార్, మర్రి సురేశ్ పరారీలో ఉన్నారు. రూ.42,100నగదు, స్మార్ట్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు.

**క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి**

**ఖిలా వరంగల్ :** క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 20 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వరంగల్ కరీమాబాద్‌లోని ఓ ఇంటి ఆవరణలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేసి కరీంనగర్‌కు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

## దారి దోపిడీ దొంగల అరెస్ట్

**వరంగల్:** వరంగల్ దేశాయిపేట రోడ్డులోని సూర్య బార్ సమీపంలో ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి దారి వెంట వెళ్తున్న ఎల్‌బీనగర్‌కు చెందిన జాకీర్ అనే వ్యక్తికి చెందిన లారీలను ఆపి డ్రైవర్, క్లీనర్లను చితకబాది రూ.3 వేలు లాక్కున్న దారి దోపిడీ దొంగలను అరెస్ట్ చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ.షుకుర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకశిలానగర్‌కు చెందిన ఎండీ. షహబాజ్, కడారి పవన్‌పాల్, జూపాక మధుకర్ ఈ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3 వేలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# పని ఉందని నమ్మబలికి..

● మహిళ వద్ద నుంచి బంగారం అపహరించిన దుండగులు
● తొర్రూరులో ఘటన



మహిళా కూలీలను బైక్‌పై ఎక్కించుకుని వెళ్తున్న దుండగుడు (సీసీ ఫుటేజీ)

**తొర్రూరు:** ఇద్దరు మహిళా కూలీలు అడ్డపై ఉండగా ఓ దుండగుడు పని ఉందని నమ్మించి బైక్‌పై ఎక్కించుకుని పుస్తెల తాడు అపహరించాడు. ఈ ఘటన తొర్రూరు పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. తొర్రూరుకు చెందిన గూబ కొమురమ్మ, భూక్య సునీత రోజు వారీ కూలి పనులకు వెళ్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. రోజూమాదిరి శనివారం కూడా పట్టణంలోని అన్నారం రోడ్డులోని అడ్డపై పని కోసం నిలుచున్నారు. వారిని గమనించిన ఓ దుండగుడు పని ఉందని ఇద్దరిని బైక్‌పై ఎక్కించుకున్నాడు. మహబూబాబాద్ వెళ్లే రోడ్డులోని పీజీ తండా సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలో బైక్ నిలిపాడు. మరో దుండగుడు అక్కడికి చేరుకున్నాడు. అనంతరం ఇద్దరిని బెదిరించి గూబ కొమురమ్మ మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు లాక్కొని అక్కడి నుంచి ఉడాయించారు. ఈ ఘటనపై కొమురమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, అన్నారం రోడ్డులో సదరు మహిళలను బైక్‌పై ఎక్కించుకున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమవగా పోలీసులు పరిశీలించారు.

**పట్టణంలో ఓ ఇంట్లో చోరీ..**

పట్టణంలోని మూల మహేశ్ ఇంట్లో శుక్రవారం రాత్రి దుండగలు చొరబడి బంగారు ఆభరణాలు అపహరించారు. యజమానులు వేరే ఊరుకు వెళ్లిన తరుణంలో ఇదే అదునుగా భావించిన దొంగలు.. ఇంటి తాళం పగులగొట్టి 2 తులాల బంగారం, 12 తులాల వెండి ఆభరణాలు, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

## ఇసుక తీసుకురావడానికి వెళ్లి..

మహిళ దుర్మరణం

● ట్రాక్టర్ ట్రేలర్ బోల్తాపడడంతో ఈ ఘటన



లక్ష్మి(ఫైల్)

**కొత్తగూడ:** ఇసుక తీసుకురావడానికి వెళ్లిన ఓ మహిళ దుర్మరణం చెందింది. ట్రాక్టర్ ట్రేలర్ బోల్తా పడి మృతి చెందింది. ఈ ఘటన శనివారం మండలంలోని వేలుబెల్లిలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఐత ఎల్లయ్య ఇల్లు నిర్మించుకోవడానికి గ్రామ సమీపంలోని వాగు నుంచి ఇసుక తీసుకురావడానికి ట్రాక్టర్ తీసుకుని ఐత లక్ష్మి(56), సరోజన, ఎల్లయ్య, ప్రిన్స్ వెళ్లారు. ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసుకుని వస్తుండగా అటవీ ప్రాంతంలో ట్రేలర్ (డబ్బా) ఒక పక్క టైర్ రాయి ఎక్కడంతో బోల్తా పడింది. దీంతో ఐత లక్ష్మి, సరోజన, ఎల్లయ్య, ప్రిన్స్ ఇసుకలో కూరుకుపోయారు. ఈఘటనలో లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందగా మిగతా ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై కుశ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు సీహెచ్‌సీకి తరలించారు.

# 'సన్న బియ్యం' దేశానికే ఆదర్శం

## రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ



గోవిందరాజుల గుట్ట ప్రాంతంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి సురేఖ, పక్కన మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తదితరులు

**వరంగల్ చౌరస్తా/ఖిలా వరంగల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం దేశానికే ఆదర్శమని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 27, 32,37,42వ డివిజన్లలోని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్న బియ్యం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో ప్రారంభించిన సన్నబియ్యం కార్యక్రమం విజయవంతమైందన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇవ్వడంతో దళారీ వ్యవస్థ ఏర్పడి ఇతర ప్రాంతాలకు అమ్ముకుని సొమ్ము చేసుకునే వారిన్నారు. నేడు ప్రతీ లబ్ధిదారుడు సన్నబియ్యాన్ని వినియోగించుకుంటూ అక్రమ దందాకు అడ్డుకట్ట వేస్తున్నాడన్నారు.

**బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళి**

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా 27 డివిజన్‌లోని కూరగాయల మార్కెట్ జంక్షన్‌లో ఆయన చిత్రపటానికి మంత్రి సురేఖ పూలమాలవేసి నివాళుల ర్పించారు. అదే విధంగా వరంగల్ 26వ డివిజన్‌లో రూ.10 లక్షల నిర్మించనున్న సిఖ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను, 42వ డివిజన్ రంగశాయిపేట లెనిన్‌నగర్‌లో రూ.22 లక్షల స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులతో నిర్మించే అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను మంత్రి సురేఖ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వరంగల్ కలెక్టర్ సత్య శారద, నగర మేయర్ గుండు సుధారాణి , బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వా కడే, కార్పొరేటర్లు చింతాకుల అనిల్, పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, సుధాకార్, వేల్పుగొండ సువర్ణ, గుండు చందన, పూర్ణచందర్, పుర్కాన్, బైరబోయిన ఉమ, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ , మీసాల ప్రకాశ్, జారతి రమేశ్, బోగి సురేష్, సంగరబోయిన చందర్, కేడల పద్మ, కర్రె కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# 14న రామప్పకు మిస్ వరల్డ్ టీం

● రామప్ప వైభవాన్ని చాటిచెబుదాం
● ఎలాంటి పొరపాట్లు జరగొద్దు
● రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి




అధికారులకు సూచనలిస్తున్న పర్యాటక శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి

**వెంకటాపురం(ఎం):** హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ పోటీలకు హాజరయ్యే విదేశీలు మే 14న రామప్ప ఆలయాన్ని సందర్శించనున్నారని, ఈ నేపథ్యంలో మిస్ వరల్డ్ టీం అబ్బురపడేలా రామప్ప కళావైభవం చాటిచెప్పాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని కలెక్టర్ దివాకర టీఎస్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యుడు, ప్రొఫెసర్ పాండురంగారావుతో కలిసి సందర్శించారు. మే 14న మిస్ వరల్డ్ టీం సందర్శన సందర్భంగా రామప్పలో కల్చరల్ ప్రోగ్రాం ఏర్పాటు చేయాలని, కాకతీయుల చరిత్ర, శిల్పాకళాసంపద, పేరిణి తాండవంతో పాటు రామప్ప విశిష్టత వివరించాలన్నారు. ఆలయ సందర్శన, సరస్సులో బోటింగ్, కాటేజీల సందర్శన సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా మినిట్ టు మినిట్ ప్రోగ్రాం తయారు చేయాలన్నారు. ఏఏ శాఖల అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేపట్టాలో వివరించారు. హైదారాబాద్‌లో పర్యాటక, సాంస్కృతిక కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ప్రోగ్రాం కార్యక్రమాలు ఫైనల్ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా టూరిజం అధికారి శివాజీ, టూరిజం కార్పొరేషన్ అధికారులు సరిత, ధనరాజ్, శ్రీనివాసరావు, సూర్యకిరణ్, లోకేశ్, పురావస్తుశాఖ సీఏ నవీన్‌కుమార్, ఫోర్‌మెన్ ప్రదీప్‌బాబు, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ఎస్సై జక్కుల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో పోస్టల్ ఉద్యోగి మృతి

● స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఘటన
● మృతుడు ఏపీలోని ఏలూరు జిల్లా వాసి



నాగదుర్గబాలాజీ (ఫైల్)

**స్టేషన్‌ఘన్‌పూర్:** విద్యుదాఘాతంతో ఓ పోస్టల్ ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగింది. సీఐ జి.వేణు కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా కైకలూరు మండలం నరసాయపాలెం గ్రామానికి చెందిన బోడావుల నాగదుర్గబాలాజీ(27) గతేడాది నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. మొదట మీదికొండలో అద్దెకున్న నాగదుర్గబాలాజీ.. ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్ తిరుమలనాథ కాలనీలో ఓ ఇంట్లోకి అద్దెకు వచ్చాడు. రోజూ మాదిరి శనివారం ఉదయం స్నానం చేసేందుకు హౌజ్‌లో ఉన్న నీటిని బకెట్‌లో పట్టుకునేందుకు మోటారు ఆన్ చేశాడు. అయితే నీరు రాకపోవడంతో స్విచ్ ఆఫ్ చేయకుండానే మోటారుకు ఏమైందో చూసేందుకు చేతితో ముట్టుకున్నాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై కేకలు వేస్తూ కిందపడ్డాడు. అయితే ఆ ఇంటిలో అతడు ఒక్కడే ఉండడంతో వెంటనే ఎవరూ గమనించలేదు. కాగా, కేకలు విన్న సమీపంలో పనిచేస్తున్న తాపీ కార్మికులు ఇంటి పక్కవారికి చెప్పారు. వారు వెళ్లి చూడగా కిందపడి ఉన్నాడు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, నాగదుర్గ ప్రసాద్ మృతిపై సహ ఉద్యోగులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.